## క్లుప్తంగా

### వరద బాధితులకు నిత్యావసర సరుకులు



వై.జంక్షన్ నుంచి వరద బాధితులకు నిత్యావసర సరుకులు తరలిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: వరద బాధితుల సహాయార్థం కొయ్యలగూడెం మండలం నుంచి నిత్యావసర సరుకులు శుక్రవారం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో తరలించారు. ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆదేశాల మేరకు పార్టీలోని ప్రజాప్రతినిధులు, నాయకులు ద్వారా సేకరించిన సుమారు రూ.1.60 లక్షల విలువైన బియ్యం ఇతర నిత్యావసర వస్తువులను కుకునూరు, వేలేరుపాడు మండలాలకు పంపిణీ చేయడానికి తీసుకువెళ్లారు. వై.జంక్షన్ నుంచి ప్రారంభమైన వాహనాన్ని పార్టీ నాయకులు ఈ సందర్భంగా ప్రారంభించారు. తోట జయబాబు, తేలే శ్రీను, చిక్కాల దుర్గాప్రసాద్, పునెం కన్నయ్య, కొడారి ప్రసాద్, శ్రీను పాల్గొన్నారు.

### నాగేశ్వరస్వామి ఆలయ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



ఆశన్నగూడెంలో నాగేశ్వరస్వామి ఆలయ నూతన పాలక కార్యవర్గం

లింగపాలెం: ఆశన్నగూడెంలో నాగేశ్వరస్వామి ఆలయ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమం శుక్రవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దేవాదాయ శాఖ ఈఓ కలగాల శ్రీనివాస్ నూతన కార్యవర్గం సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. నాగేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా బండారు వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులుగా కట్టా చిట్టికాసులు, మోదుగు రత్నతులసి, తోకల సంజీవరావు, చౌటపల్లి నాగకుమారి, లింగాల గంగారత్నం, పసుపర్తి జలమయ్య ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయాన్ని అభివృద్ధిపథంలో నడుపుతానని నూతన కమిటీ చైర్మన్ వెంకటేశ్వరావు అన్నారు. సర్పంచ్ పానుగంటి పద్మజ, మార్కెట్ యార్డు డైరెక్టర్ కుప్పాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాలకు సిమెంట్ బెంచీల వితరణ



జంగారెడ్డిగూడెం బాలుర హైస్కూల్లో ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలు

జంగారెడ్డిగూడెం: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ విద్యార్థులకు వైఎస్సార్ సీపీ మండల కమిటీ అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు 10 సిమెంట్ బెంచీలు బహూకరించారు. హైస్కూల్ హెచ్ఎం లవకుమారి, పీడీ, ఆర్చరీ కోచ్ ఎల్.జయరాజు ప్లేగ్రౌండ్‌లో విద్యార్థులు కూర్చొనేందుకు సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేయాలని వామిశెట్టి హరిబాబును కోరారు. దీంతో ఆయన తల్లి వామిశెట్టి దుర్గమ్మ జ్ఞాపకార్థం 10 సిమెంట్ బెంచీలను హైస్కూల్‌కు బహూకరించారు. హెచ్ఎం, పీడీ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

### 16 మందిపై కేసు నమోదు

టి.నరసాపురం: భూమిలోకి అక్రమంగా ప్రవేశించి చెట్లు ధ్వంసం చేసిన నేరంపై రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 16మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.సతీష్‌కుమార్ తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన కాసరనేని చంద్రశేఖర్‌కు మండలంలోని అల్లంచర్ల రాజుపాలెంలో సర్వే నంబర్ 227, 231లో 275 ఎకరాలు వారసత్వ రీత్యా సంక్రమించిన భూమి ఉందన్నారు. ఇదే భూమిపై హైకోర్టు కూడా చంద్రశేఖర్‌కు అనుకూలంగా, భూమిలోకి ఎవరూ ప్రవేశించకూడదని గతంలో ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. సదరు భూమిలో టేకు, జామాయిల్, వెదురుతోట ఉన్నాయి. ఈ నెల 27వ తేదీ చంద్రశేఖర్ పొలంలోకి అదే గ్రామానికి చెందిన గొల్లపూడి ఆంజనేయులు, మరో 15మంది వ్యక్తులు అక్రమంగా ప్రవేశించి రూ.లక్ష విలువ చేసే టేకు, వెదురు, జామాయిల్ తోటను నరికి నష్టం కలిగించారన్నారు. చంద్రశేఖర్ శుక్రవారం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### ఉచిత దంత వైద్యశిబిరం

జంగారెడ్డిగూడెం: ఈ నెల 30వ తేదీ ఆదివారం జంగారెడ్డిగూడెం పట్టణంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు బాపూజీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్థానిక సూర్య దంత వైద్యశాలలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ప్రముఖ దంత వైద్యులు సీహెచ్ శివరామ్ వైద్యపరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9441447197, 9440369777 నంబర్లను సంప్రదించాలన్నారు.

# ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వ ప్రోత్సాహం



చింతలపూడి: రైతులకు విత్తన కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా



కామవరపుకోట: సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ రవీంద్రబాబు

చింతలపూడి: ప్రకృత్యి వసాయం చేసే రైతులకు ప్రభుత్వం అనేక రాయితీలు అందించి ప్రోత్సహిస్తోందని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా పేర్కొన్నారు. మండలంలోని రాఘవాపురం శుభం ఫంక్షన్ హాల్లో శుక్రవారం ప్రధానమంత్రి అజయ్ (పీఎం ఏజెఏవై) పథకంలో భాగంగా ప్రకృతి వ్యవసాయం చేసే ఎస్సీ రైతులకు విత్తన కిట్లు, ప్రోత్సాహకాలను ఎమ్మెల్యే ఎలీజా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ ఉత్పత్తుల వినియోగంతో ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. సేంద్రియ వ్యసాయం విదానంలో నవ ధాన్యాలు, చిరు ధాన్యాలు రైతులు పండించి లాభాలు సాధించాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అనేక పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రేవుల గద్ద కుముదినీ సింగ్, సొసైటీ అధ్యక్షుడు చుండూరి నాగేశ్వరరావు, సర్పంచ్ కోండ్రు వజ్ర కిషోర్, ఎస్ఎఫ్ఏ హుస్సేన్, సుబ్బరాజు, హుస్సేన్ బి, సర్పంచ్‌లు తాండ్ర రామకృష్ణ, కె యువరాజు, యడ్ల మోహన్‌రావు, బొల్లిన వెంకట్రావు, మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, చింతలపూడి పట్టణ పార్టీ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ ఏడీ బి నాగకుమార్, మండల పరిషత్ చీఫ్‌విప్ కె రామారావు, ఎంపీటీసీలు సయ్యద్ యూసుఫ్, ఉలవలపూడి సువార్తమ్మ, విద్యాసాగర్ పాల్గొన్నారు.

**చిరుధాన్యాల పంపిణీ**

పోలవరం రూరల్: గిరిజన రైతులకు అదనంగా ఆదాయం సమకూర్చేందుకు చిరుధాన్యాల సాగుపై రైతులకు అధికారులు అవగాహన కల్పించారు. పోలవరం మండలం గడ్డపల్లి గ్రామంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం అనంతరం రైతులకు ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి , జెడ్పీటీసీ కలుం హేమకుమారి, ఎంపీడీవో జి.శ్రీను, ఏపీఎం బి.శ్రీను, వ్యవసాయ శాఖాధికారి కె.రాంబాబులు రైతులకు చిరు ధాన్యాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం శ్రీను మాట్లాడుతూ మండలంలో 10 గ్రామాల్లో 200మంది రైతులకు 500 ఎకరాల్లో చిరు ధాన్యాలు పండించేందుకు విత్తనాలు అందజేశారు. గిరిజన రైతులు పండించిన చిరుధాన్యాలను తిరిగి రైతు ఉత్పత్తి సమాఖ్య ద్వారా కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు.

**ప్రపంచ ప్రకృతి సంరక్షణ దినోత్సవం**

కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఐ.క్యూ.ఎ.సి విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ప్రకృతి సంరక్షణ దినోత్సవాన్ని ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవీంద్రబాబు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముందుగా అధ్యాపకులు, విద్యార్థులు కలిసి ప్రకృతి పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. అధ్యాపకులు ఎం.మల్లేశ్వరరావు, డాక్టర్ జి.శ్రీనివాసరావు, గుండా రామ్మోహన్, వి.శ్రీనివాస్, ధారావతు మల్లేష్, ఎం.హర్షవర్ధిని, ఆఫీస్ సిబ్బంది చంద్రమోహన్, అన్నపూర్ణమ్మ, రత్నసిరిలో, కుమార్ రాజా పాల్గొన్నారు.

### ఎరక్రాలువ నీటిమట్టం 81 మీటర్లు

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెం శ్రీకరాటం కృష్ణమూర్తి ఎర్రకాలువ జలాశయంలోకి శుక్రవారం ఉదయం గంటకు 3,648 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరగా సాయంత్రానికి సమయానికి 500 క్యూసెక్కుల చొప్పున వరద నీరు చేరింది. జలాశయం నీటిమట్టం 83.50 మీటర్లు కాగా, ప్రస్తుతం 81 మీటర్లు నీటి నిల్వలు ఉన్నట్లు ఇరిగేషన్ శాఖ ఏఈ భాస్కరరావు తెలిపారు.

### పీర్లతో ఊరేగింపు



నిప్పుల గుండం తొక్కుతున్న ముస్లింలు

కామవరపుకోట: మండలంలో మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లింల ఆధ్వర్యంలో పీర్ల పండుగ ఘనంగా నిర్వహించారు. స్థానిక చౌతన సెంటర్లో అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొని ముస్లిం వీరులకు ప్రతికగా హస్తాకృతి రూపాలను తయారుచేసి అలంకరించి పూజలు నిర్వహించారు. మేళతాళములతో పీర్లను వైభవంగా ఊరేగిస్తూ మహిళలు యువకులు పీర్లను ఎత్తుకుని అడుగులు వేశారు. భక్తిశ్రద్ధలతో యువకులు పీర్లు ఎత్తుకొని నిప్పుల గుండం తొక్కారు. అనంతరం ముస్లిం పెద్దలు భక్తులకు పాయసం, బూందీ, మరమరాలు, ఖర్జూరం, పటిక బెల్లం పంపిణీ చేశారు.

### పారిజాత గిరిలో స్వామివారికి ప్రత్యేక పూజలు



పారిజాతగిరిలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాత గిరి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం సందర్భంగా ఉదయాస్తమాన సేవలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాత సేవ, పూజలు వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఆర్జిత సేవగా నిర్వహించబడే ఈ కార్యక్రమానికి ఏలూరు వాస్తవ్యులు శీమకుర్తి బాబా ప్రసాద్ దంపతులు, వినుకొండకు చెందిన మేడూరి వెంకట భాస్కర్ దంపతులు, ఉభయదారులుగా వ్యవహరించారని కార్యనిర్వహణ అధికారి మానికల రాంబాబు తెలియజేశారు. ఉభయదారులను ఆలయ అర్చకులు రవికుమార్ ఆచార్యులు, రుషికేష్, కుమార్ ఆచార్యులు, రాఘవాచార్యులు, ఆశీర్వదించి స్వామివారి శేష వస్త్రములు, ప్రసాదాలు అందజేశారు.

# నిండు కుండలా జల్లేరు జలాశయం



బుట్టాయగూడెం మండలంలో గుబ్బల మంగమ్మ జల్లేరు జలాశయంలో వరదనీరు

బుట్టాయగూడెం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు బుట్టాయగూడెం మండలం దొరమామిడి సమీపంలో ఉన్న గుబ్బల మంగమ్మతల్లి జల్లేరు జలాశయంలోకి భారీగా వరదనీరు వచ్చి చేరింది. ఈ జలాశయం పూర్తి సామర్థ్యం 217.80 మీటర్లు కాగా ప్రస్తుతం వర్షాలకు వచ్చిన వరదనీటితో 215.55 మీటర్లకు చేరుకున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. కొండల్లో కురుస్తున్న వర్షాలకు వరదనీరు వచ్చి చేరుతున్నందున జలాశయం నుంచి శుక్రవారం రాత్రి సుమారు 150 క్యూసెక్‌ల నీటిని బయటకు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.

**చెరువులను తలపిస్తున్న పంట పొలాలు**

పోలవరం రూరల్: గోదావరి వరద తగ్గుతూ, పెరుగుతూ ఐదు రోజులుగా ఊగిసలాడుతుండటంతో పోలవరంలో నాట్లు వేసిన పొలాలు, ఆకుమడుల్లోకి వరదనీరు పోటెత్తింది. కడెమ్మ గేట్లు మునిగిపోవడంతో వరద నీరు ఎగపోటు తన్నింది. దీనికి భారీ వర్షాలకు కొండవాగుల నీరు తోడయ్యాయి. పొలాలన్నీ నీటమునిగి చెరువులను తలపిస్తున్నాయి. వరద పూర్తిస్థాయిలో తగ్గితే తప్ప ఈ నీరంతా నదిలోకి చేరే పరిస్థితి లేదని, ఆకుమడులు, నాట్లు కుళ్లిపోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పోలవరంలో వరదనీటిలో పొలాలు



జలాశయం నుంచి వరద నీటి విడుదల

### నూకాలమ్మకు విశేష పూజలు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం నూకాలమ్మవారి ఆలయంలో శుక్రవారం సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ, రామలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ఆలయ కల్యాణ కళా వేదిక వద్ద ఉత్సవ మూర్తికి పంచామృతాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకాలు, మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు అర్చకస్వాములు నిర్వహించారు. డాక్టర్ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ అమ్మ వారి వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, ప్రసాద వితరణకు నందిన కమల జ్ఞాపకార్థం కుమారుడు నందిన సాయివినయ్ (కొమ్ముగుడెం) రూ.10,116 విరాళంగా అందజేశారన్నారు. దాత కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆగస్టు 1వ తేదీ పౌర్ణమి రోజున 53వ చండీహోమం నిర్వహిస్తామని రాజాన తెలిపారు. గొట్టుముక్కల వంశీ కుమారరాజు, రొంగల పుల్లయ్య, కంచుమర్తి ప్రకాష్, అనిశెట్టి కృష్ణమోహన్, వగ్వాల పవన్ సాయిమణికంఠ, మైరెడ్డి జగదీష్, చింతకాయల అచ్చిరాజు, గెద్దాడ శ్రీనివాస్, ఆలపాటి దుర్గాప్రసాద్ (నాని), పట్టణ ప్రముఖులు, మహిళలు , కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# జగనన్న సురక్ష విజయవంతం



జగనన్న సురక్ష ముగింపు కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు



గడ్డపల్లిలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

కొయ్యలగూడెం: జగనన్న సురక్ష కార్యక్రమం పరింపూడి సచివాలయ పరిధికి సంబంధించి శుక్రవారం నిర్వహించారు. సుమారు నెలరోజుల పాటు కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ఉన్నతాధికారులు, సిబ్బంది ప్రజాప్రతినిధులను కలుపుకొని విశేష కృషి చేశారని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పాసం నాగమణి, ఎంపీడీవో ఆర్ బేబీశ్రీలక్ష్మిలను ఎంపీపీ గంజిమాల రామారావు ఘనంగా సత్కరించారు. దరఖాస్తు దారులకు ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జగనన్న సచివాలయాల మండల కో–ఆర్డినేటర్ నూకల రాము సర్పంచ్ ఎం.విజయకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఉదయ్ కుమార్, ఏపీవో కె.నాగేశ్వరరావు, ఏపీఎం సుబ్రమణ్యం, ఎంపీటీసీలు చింత శ్రీదేవి, గంటా శ్రీనివాస్, టౌన్ కన్వీనర్ సంకుకొండ, చిటికెన నాగార్జున మడుతూరి శ్రీను పాల్గొన్నారు.

**సమస్యలు పరిష్కారం**

పోలవరం రూరల్: ప్రజలకు అన్ని సేవలు చేరువలోకి తీసుకురావడానికే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అన్నారు. పోలవరం మండలం గడ్డపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తుల పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసువచ్చారు. పోలవరం ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ మాట్లాడుతూ వసతిగృహంలో ఉంటున్న విద్యార్థుల విషయంలో తల్లితండ్రులు జాగ్రత్తలు వహించాలన్నారు. తల్లితండ్రులు వసతి గృహానికి వెళ్లి పిల్లల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. లబ్ధిదారులకు ధృవీకరణపత్రాలు, కౌలు రైతులకు కౌలు కార్డులు అందజేశారు. జెడ్పీటీసీ కలుం హేమకుమారి, ఎంపీడీవో జి.శ్రీను, కార్యదర్శి రాజారావు, వ్యవసాయ శాఖాధికారి కె.రాంబాబు, పలుశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### మానవ అక్రమ రవాణాపై న్యాయ విజ్ఞాన సదస్సు

జంగారెడ్డిగూడెం: నేటి సమాజంలో స్త్రీలు, చిన్నారులు అక్రమ రవాణాపై ప్రతి ఒక్కరు జాగ్రత్తతో ఉండాలని జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అచ్యుత శ్రీనివాసరావు అన్నారు. జూలై 30న మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జంగారెడ్డిగూడెం పట్టణ పరిధిలోని రామచంద్రపురం వార్డు సచివాలయంలో శుక్రవారం సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా న్యాయవాదులు మేకల రామమోహన్‌రావు, దగ్గు కృష్ణ, బల్లే సాయికుమారి, వార్డు సచివాలయం అడ్మిన్ ఎం.భద్రగిరివాసు పాల్గొన్నారు.

### మణిపూర్ సంఘటనపై శాంతి ర్యాలీ



జీలుగుమిల్లిలో శాంతి ర్యాలీ

బుట్టాయగూడెం( జీలుగుమిల్లి): మణిపూర్‌లో శాంతి యుత వాతావరణం నెలకొల్పే విధంగా ప్రభుత్వాలు కృషి చేయాలని కోరుతూ యునైటడ్ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన జీలుగుమిల్లిలో క్రైస్తవులు, హిందువులు, ముస్లింలు, మహిళలు, అంబేద్కరిస్టులు శుక్రవారం నిరసన, శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘ ప్రతినిధి సాల్మన్‌రాజు, లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక అధ్యక్షుడు ఎంపీ అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ మణిపూర్ సంఘటన అత్యంత హేయమైనదని అన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దార్ సుందర్ సింగ్‌కు అందజేశారు. స్థానికంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూపీఏ నాయకులు నిరీక్షణ రావు, గిరిజన సంఘ నాయకులు తెల్లం దుర్గారావు, ఐద్వ మండల కార్యదర్శి నేలటూరి నిర్మల, న్యాయవాది జువ్వల బాపూజీ, అంబేద్కర్ యూత్ అధ్యక్షుడు తలారి సతీష్, యూపీఏ జిల్మెట్ కమిటీ సభ్యులు, అశ్వారావుపేట, కామవరపుకోట ఫెలోషిప్‌ల పాస్టర్లు పాల్గొన్నారు.

### వరద బాధితులను అన్ని విధాలా ఆదుకుంటాం



చాగరపల్లిలో వరద బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెల్లంబాలరాజు

వేలేరుపాడు: వేలేరుపాడు, కుక్కునూరు, మండలాల్లో గోదావరి వరద బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. వేలేరుపాడు మండలంలో వరద చుట్టుముట్టిన గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. చెరువుగొల్లగూడెం ప్రాంతంలో పునరావాసముంటున్న చాగరపల్లి వరద బాధితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో నూజివీడు సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, జంగారెడ్డిగూడెం ఆర్డీఓ ఝాన్సీని వరద సహాయక చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గోదావరి వరద పరిస్థితిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఫోన్‌లో వివరించినట్లు తెలిపారు. నిరాశ్రయులైన ప్రతి కుటుంబానికి ముందస్తు సాయంగా ప్రభుత్వం రూ.2,000, ఒక వ్యక్తికి రూ.వెయ్యి ఆర్థిక సహాయం, అందించనున్నట్లు తెలిపారు. 25 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులు, కూరగాయలు అందించనున్నట్లు తెలిపారు. కచ్చా ఇళ్లు దెబ్బతింటే రూ.పదివేల ఆర్థికసాయం అందించనున్నట్లు వివరించారు. వేలేరుపాడు మండలంలో ఇప్పటి వరకు 33 గ్రామాల్లో 2,881 కుటుంబాలు వరద ప్రభావానికి గురయ్యారని. వీరందరినీ అన్ని విధాలా ఆదుకుంటున్నామన్నారు.ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు పది బోట్లు ఏర్పాటు చేశామన్నారు. వేలేరుపాడు సంతబజారుకు చెందిన 71 కుటుంబాలకు, రేపాకగొమ్ము గ్రామానికి చెందిన 205 కుటుంబాలకు కూరగాయలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పోలవరం డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ సత్యనారాయణ, ఎంపీపీ వల్లా దేవి, జెడ్పీటీసీ గుజ్జా రామలక్ష్మి, సర్పంచ్ కట్టి ఉదయ్‌కిరణ్, ఎంపీటీసీ కొమ్మరాజు రాంబాబు, వైసీపీ మండల కన్వీనర్ కేసగాని శ్రీనివాసగౌడ్, వైసీపీ నాయకులు కామినేని వెంకటేశ్వరావు, సచివాలయ మండల కన్వీనర్ కొలూరి సత్తిరాజు పాల్గొన్నారు.

**ఇంటిముంగిటకే ప్రభుత్వ సేవలు**

వేలేరుపాడు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు అందిస్తున్నామని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. గోదావరి వరద ప్రాభావిత ప్రాతమైన వేలేరుపాడు మండలం పడమటిమెట్టలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం ముంపులో 45 కాంటూర్‌లో ఉన్నపడమటి మెట్ట గ్రామాన్ని 41.15లో కలిపేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం 162 మందికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. పోలవరం డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ సత్యనారాయణ, ఎంపీడీఓ శ్రీహరి, ఎంపీపీ వల్లా లక్ష్మీదేవి, జెడ్పీటీసీ గుజ్జా రామలక్ష్మి, నార్లవరం, తాట్కూరుగొమ్ము, సర్పంచ్‌లు రంగమ్మ, కట్టి ఉదయ్‌కిరణ్, ఎంపీటీసీ కొమ్మరాజు రాంబాబు, ఎంపీటీసీ రత్తమ్మ, మండల కన్వీనర్ కేసగాని శ్రీనివాసగౌడ్, కామినేని వెంకటేశ్వరావు, మండల సచివాలయ కన్వీనర్ కొలూరి సత్తిరాజు, రత్నాజీ, ఆరెడ్డి సత్యనారాయణ, కురిమెళ్ళ రమేష్ పాల్గొన్నారు.

# మండల అభివృద్ధికి సహకరించండి



జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ప్రసాదరావు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మండల అభివృద్ధికి సహకరించాలని జెడ్పీటీసీ, వైసీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు పోల్నాటి బాబ్జి జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావును కోరారు. శుక్రవారం చైర్‌పర్సన్‌ను పోల్నాటి బాబ్జిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ప్రతిపాదనలు చేసి ఆమెకు వివరించారు. మండల అభివృద్ధికి సహకరించాలని కోరగా, ఆమె సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. పద్మశ్రీ, ప్రసాదరావు దంపతులను దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, మద్ది కమిటీ డైరెక్టర మల్నీడి బాబి, అక్కంపేట సర్పంచ్ పారేపల్లి నాగేంద్ర, ఏరియా ఆసుపత్రి డైరెక్టర్ కనుపర్తి రాజేష్, సుంకవల్లి అనిల్ పాల్గొన్నారు.

### రైతులకు పచ్చి రొట్ట విత్తనాల పంపిణీ

కొయ్యలగూడెం: కొయ్యాలగూడెం వర్జీనియా పొగాకు వేలం కేంద్రం ద్వారా రైతులకు అందజేస్తున్న చేస్తున్న పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ కార్యక్రమం పూర్తయ్యిందని పొగాకు వేలం కేంద్రం నిర్వహణ అధికారి గ్రేసీ మార్గరెట్ శుక్రవారం పేర్కొన్నారు. పరిసర గ్రామాల్లో ఇప్పటివరకు బోర్డు ద్వారా రైతులకు నెల రోజులుగా ఉచితంగా అందజేశామని తెలిపారు. విత్తనాలు కావలసిన రైతులు బోర్డు అధికారులను సంప్రదించాలన్నారు. మరో వారం పది రోజులలో వర్జీనియా పొగాకు కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి కాగవని ఆమె తెలిపారు.

### వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు



చింతలపూడి మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాంబాబు

చింతలపూడి: మండల పరిషత్ సమావేశాలకు ఎంపీటీసీ సభ్యులు తప్పని సరిగా హాజరు కావాలని మండల పరిషత్ అధ్యక్షుడు డా. బి రాంబాబు నాయక్ ఆదేశించారు. చింతలపూడి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపీపీ బి రాంబాబు నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలకు హాజరై ప్రజా సమస్యలపై చర్చించాలని కోరారు. మండలానికి రూ.60 లక్షలు ఉపాధి హామీ నిధులు మంజూరయ్యాయని స్పందనలో వచ్చిన సమస్యలు పరిష్కరించడానికి ఈ నిధులను వినియోగించాలని సభలో తీర్మానించారు. వైద్య ఆరోగ్యశాఖ, స్థానిక పంచాయతీ అధికారులు గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో రహదారుల నిర్మాణం, మరమ్మతులపై చర్చించారు. చెరువు కట్టలు పటిష్ట పరచాలని తీర్మానించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు మండల పరిషత్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ ఎం నీరజా సుధాకర్, ఏఎంసీ ఛైర్ పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, ఎంపీడీఓ మురళీకష్ణ, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కిషోర్, ఈఓ పీఆర్డీ విక్టర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.